క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కుప్పం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 180 మంది కంటి రోగులను పరీక్షించారు. వారిలో 65 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం వైద్య సిబ్బంది ఎంపిక చేశారు. వీరికి బెంగళూరులోని శారద కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, మందులు, లెన్సులు ఉచితంగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులైన సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తెలిపారు. కంటి వైద్యులు శివ ప్రకాష్, లావణ్య, శివ, గాయత్రి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పలమనేరు: పట్టణానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రచారకులు ఆదివారం మండలంలోని పి.వడ్డూరులో భగవద్గీతపై ప్రచారం చేశారు. శ్రీకృష్ణ పరమాత్ముడు సమాజానికి స్నేహితునిలా మంచిని నేర్పారని వివరించారు. భగవద్గీత పుస్తకాలను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు భాస్కర్, బాలాజీ, జ్యోతి, వాణిశ్రీ, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠ



వైష్ణవిదేవి, అభయాంజనేయస్వామి

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం భక్తి ప్రపత్తులతో అభయ ఆంజనేయస్వామి, వైష్ణవిదేవి, నాగభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వేకువ జామున నుంచి గణపతి పూజ, హోమపూజలు, అర్చనలు, నాడీ సంధానం, అష్టబలి, చండీ హోమం, కలశ పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పథకాలపై ఇంటింటా ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

సదుం: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ఆదివారం సదుంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వారు ప్రజలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ వర్గాల అభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. గత ప్రభుత్వం హామీల పేరుతో ప్రజలను నిలువునా మోసం చేసిందని, సంక్షేమ పథకాలు నాయకుల జేబుల్లోకి వెళ్లడం తప్పితే అర్హులకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు భాస్కర్, బాబు, కాలేషా, సుధీర్‌కుమార్, లోకేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ స్క్రీన్‌పై క్రికెట్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రికెట్ ప్రియులు

కుప్పం: మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు మోడల్ కాలనీ కౌన్సిలర్ హఫీజ్ క్రికెట్ అభిమానులు వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భారత్, ఆస్ట్రేలియా నడుమ జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను పలువురు ఆసక్తిగా తిలకించారు.

పలమనేరులో..

పలమనేరు: వరల్డ్ క్రికెట్ ఫైనల్స్‌ను టీవీలలో ఆసక్తిగా వీక్షించారు. ఇండియా గెలవాలని మొక్కారు. పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ మండీసుధా, నాయకులు రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షులు రఘునాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, పట్టణ వైఎస్సార్ యూత్ నాయకులు జగ్గ పట్టణంలోని రాయలవారి విగ్రహం వద్ద అన్నదానం చేశారు. మ్యాచ్ మొదలై ఇండియా తక్కువ స్కోరుకే ఆలౌట్ కావడం, ఆస్ట్రేలియా సునాయాసంగా గెలవడంతో క్రికెట్ ప్రేమికులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

నేడు షాపు రూముల వేలం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని రెండు షాపు రూములను సోమవారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తామని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బస్టాండు, ఉబేదుల్లా కాంపౌండులోని ఒక్కో రూమును వేలం వేస్తామని, ఆసక్తి గల వ్యాపారులు నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

జగనన్నతోనే సర్వతోముఖాభివృద్ధి

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి జగనన్న చేతిలో పెట్టారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి ఒక వైపు, సంక్షేమం మరో వైపు చూస్తూ రాష్ట్రాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం కుప్పం మండలం వి.మిట్టపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్' ఆయన నిర్వహించారు. కరోనా మహమ్మారి మూలాన రెండేళ్లు పూర్తిగా వృథా అయినా రెండేళ్లలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో జగన్ ప్రజారంజక పాలన చేశారన్నారు. 35 ఏళ్లుగా కుప్పంకు చంద్రబాబు చేసిందేమీ లేదని, జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన వెంటనే అన్ని మంజూరు చేస్తున్నారని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి హంద్రీ–నీవా కాలువ ప్రారంభానికి కుప్పం వస్తున్నట్లు చెప్పారు. శాశ్వత సాగు, తాగు నీటికి కృష్ణా జలాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రిని రాబోవు ఎన్నికల్లోనూ ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతారని చెప్పారు.



వి.మిట్టపల్లెలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

పార్టీ జెండా ఆవిష్కరణ

సమావేశం అనంతరం వి.మిట్టపల్లెలో వైఎస్సార్ సీపీ జెండాను స్థానికులతో కలిసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు.

సీసీ రోడ్డు ప్రారంభం

మండలంలోని వెండుగంపల్లె పంచాయతీ జంబు చెరువు కొటాలు గ్రామంలో 20 లక్షల రూపాయలతో వేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్సీ భరత్ ఆదివారం ప్రారంభించారు. వర్షం వస్తే నడవ లేకపోతున్నామని, గత గ్రామ సందర్శనలో ఎమ్మెల్సీ దృష్టికి సమస్యను గ్రామస్తులు నివేదించారు. దీనిపై ఆయన స్పందించారు. నెల వ్యవధిలోనే సీసీ రోడ్డును వేయించి గ్రామస్తుల మన్ననలు అందుకున్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భరత్



పుంగనూరు ఆంజనేయస్వామికి సంబంధించి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుస్తకావిష్కరణ

పుంగనూరు: పట్టణంలో హనుమంతరాయునిదిన్నెలోని శ్రీవీరాంజనేయస్వామి చరిత్రపై రచించిన పుస్తకాన్ని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం తిరుపతిలో ఆవిష్కరించారు. ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు , ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 22 వరకు నిర్వహించనున్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసి ఆలయ పునఃనిర్మాణం, ప్రహరీతో పాటు స్వామివారి పుష్కరిణిని నిర్మించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి ఈనెల 25న పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయ చరిత్ర గురించి పుస్తకంలో ఎంతో బాగా రాశారని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మణి, గణపతి, గంగాధర్, ఈ.మణి, మంజునాథ్, భాస్కర్, సతీష్, ప్రవీణ్, హిమవంత్, శ్రీనివాసమొదలి తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాలు ప్రారంభం

శ్రీవీరాంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల పూజలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. కలశస్థాపన, ధ్వజస్తంభం, మహాకుంభాభిషేక పూజలు చేసి అంకురార్పణ గావించారు. 22 వరకు వివిధ కార్యక్రమాలను, నిత్యహోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు

రొంపిచెర్ల: ప్రభుత్వ మద్యం దుకాణాలలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి హెచ్చరించారు. ఆదివారం రొంపిచెర్లలోని రెండు మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం కొన్ని మద్యం బ్రాండ్ల ధరలను పెంచిందన్నారు. తాము నిర్వహిస్తున్న డెకాయ్ ఆపరేషన్‌లో ఎవరైనా సిబ్బంది అధిక ధరలకు విక్రయిస్తే వారిపై వేటు తప్పదన్నారు. మద్యం విక్రయాల సొమ్మును రోజూ బ్యాంక్‌లో జమ చేయాలన్నారు. ఇద్దరు కొత్త వ్యక్తులను పంపి మద్యం కొనుగోలు చేయించామని, అయితే ధరలలో ఎలాంటి తేడాలు లేవన్నారు. తనిఖీలో వెరిఫికేషన్ ఆఫీసర్ నాగరాజు, సూపర్‌వైజర్లు సురేషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

రామకుప్పం: మండలంలోని కెంచనబళ్ల పంచాయతీ గాంధీనగరానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాజప్ప ఆదివారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను అందజేశారు. అలాగే, చిన్నబల్దార్ గ్రామానికి చెందిన సోమశేఖర్ అనే యువకుడు మృతి చెందడంతో ఆ కుటుంబానికి స్థానిక వైఎస్సార్ సీపీ నేత అశోక్‌రెడ్డి ద్వారా రూ.10 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు చలపతి, మండల కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, చిన్నతంబి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పొన్నాంగూరులో..

కుప్పం రూరల్: పొన్నాంగూరులో అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన కందస్వామి (61) కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ హెచ్ ఎం మురుగేష్ పది వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



రామకుప్పం: కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రాష్ట్రస్థాయి పోటీలకు మర్రిమాకులపల్లె విద్యార్థులు



అఫ్రీద్, గౌతమ్‌కుమార్

చౌడేపల్లె: అండర్–14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.అఫ్రీద్, ఎన్.గౌతమ్ కుమార్ (8వ తరగతి) ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నాదమునినాయుడు తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా భీమిలిపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు హెచ్‌ఎం చెప్పారు. క్రీడాకారులను హెచ్‌ఎంతోపాటు పీడీ పవన్‌కుమార్ అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

శాంతిపురం: విద్యార్థులలో విద్యా ప్రమాణాల పెంపు కోసం తమ వంతుగా మండలంలో 15 ఉచిత ట్యూషన్ సెంటర్లను నడుపుతున్న గ్రేస్‌మేరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బాలల దినోత్సవం నిర్వహించారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కరేగానూరు వద్ద ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో ఎంఈఓ చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ట్రస్ట్ మేనేజర్ ఆరోగ్యరాజ్, వశీంఖాన్, రోసామెస్టికా తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

గుడిపాల: మండలం మీదుగా వెళుతున్న బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. 258 కిలోమీటర్ల మేర జరిగే ఈ రోడ్డు పనులు ఊపందుకున్నాయి. బెంగళూరు నుంచి తమిళనాడు శ్రీపెరంబుదూరుకు కలుపుతూ రోడ్డు పనులు చేస్తున్నారు. మండలంలోని దాయంవారిపల్లె నుంచి 189 కొత్తపల్లె, వసంతాపురం, కుప్పిగానిపల్లె, చలిచీమలపల్లె మీదుగా తమిళనాడుకు వెళుతుంది. స్తంభాలను నిర్మించి వాటిపై దిమ్మెలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయి. పూర్తయిన చోట తారురోడ్డు పనులను వేగంగా చేస్తున్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన



వి.కోట: ప్రైవేటు లెక్చరర్ మౌలికను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం ఒక వ్యాపకంగా మలచుకుని జ్ఞానాన్ని సముపార్జించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సావాలలో భాగంగా పుస్తక పఠనం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. విద్యార్థులు తరచూ గ్రంథాలయాలకు వెళ్లడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. పుస్తకం ఓ మంచి నేస్తమని, పుస్తకాలతో ప్రపంచాన్ని చూడవచ్చన్నారు. కార్యక్రమంలోబీసీ హాస్టల్ వార్డెన్ ఉమాదేవి, జెడ్పీ బాలికల హైస్కూలుకు చెందిన తెలుగు టీచర్ మంజుల, ప్రైవేటు కాలేజీ లెక్చరర్ మౌలిక, మహిళా పోలీస్ మహేశ్వరి తదితరులను సన్మానించారు. కళాభారతి ఫౌండేషన్ అధ్యక్షులు రఘుపతి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలకు సమాజాన్ని మార్చే శక్తి

పలమనేరు: సమాజాన్ని మార్చే శక్తి పుస్తకాలకు ఉంటుందని ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో 'నాకు నచ్చిన పుస్తకం' అనే కార్యక్రమం గ్రంథాలయాధికారి హేమకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే పిల్లలకు పుస్తక పఠనంపై మక్కువను పెంచాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. పలువురు సాహితీ ప్రియులు వారికి నచ్చిన పుస్తకం, అది వారికి ఎందుకు నచ్చిందో వివరించారు. గ్రంథాలయానికి సాహిత్య పత్రికలను తెప్పించేందుకు బైరెడ్డిపల్లె మహతి ఫౌండేషన్ రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి రెడ్డి, రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, ప్రసన్నలక్ష్మి, రెడ్డెమ్మ, చంద్రశేఖరయ్య, మల్లిచెట్ల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు : తమకు నచ్చిన పుస్తకాలను చూపుతున్న రచయితలు

24 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31వ వార్డుల్లో ఈ నెల 24 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 24న భగత్‌సింగ్ కాలనీలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమం 16 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, వారు పొందిన లబ్ధి తదితర వివరాలతో 16 సచివాలయాల్లో డిజిటల్ బోర్డులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

తేదీల వారీగా...

24న భగత్‌సింగ్‌కాలనీ, 28న చంద్రమౌళి మార్కెట్, 29న రహమత్ నగర్, 30న తూర్పుమొగశాల–1, డిసెంబర్ 1న తూర్పు మొగశాల 2వ సచివాలయం, 4న తేరువీధి 1వ సచివాలయం, 5న తేరువీధి 2వ సచివాలయం, 6న నానబాలవీధి సచివాలయం, 7న తేరువీధి 3వ సచివాలయం, 8న తేరువీధి 4వ సచివాలయం, 11న బీడి కాలనీ 1వ సచివాలయం, 12న బీడి కాలనీ 2వ సచివాలయం, 13న గోకుల్ సర్కిల్ సచివాలయం , 14న కొత్తయిండ్లు 1వ సచివాలయం, 15న కొత్తయిండ్లు 2వ సచివాలయం, 18న కొత్తపేట సచివాలయాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

మానవ సంబంధాలు పెంపొందించుకోవాలి



వన భోజనాలు చేస్తున్న పట్టణ ప్రజలు

పలమనేరు: కనుమరుగవుతున్న మానవ సంబంధాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అన్నారు. ఆదివారం మండలంలోని కూర్మాయి కూర్మవరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవ సంబంధాలు రోజు రోజుకు మృగ్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ ఫోన్లకే ఎక్కువ సమయం కేటాయిస్తూ, కనీసం ఇరుగు పొరుగు ఇళ్లలో ఏం జరుగుతోందో కూడా తెలుసుకోలేని స్థితిలో ఇప్పటి ప్రజలు కొట్టుకుపోతున్నారన్నారు. మానవ సంబంధాల ల బలోపేతానికి, అందరూ కలసి మెలసి ఉండటానికి ఇలాంటి సామూహిక వనభోజనాల కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం కూర్మాయిలోని శ్రీ కూర్మ వరదరాజస్వామి ఆలయ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. మహిళలతో కలిసి భజన చేశారు. పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు, పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, సీఐ చంద్రశేఖర్, ఏపీ ఎన్జీవోల నాయకులు ఆనంద్, స్థానిక సర్పంచ్ చెంగమ్మ, ఏపీ ఎన్జీవోల సంఘం, సచివాలయ ఉద్యోగుల సంఘం , పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్, మాజీ సైనికోద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భజన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్

పంట నూర్పిళ్లతో రైతన్నలు బిజీ బిజీ!



పలమనేరు మండలం నక్కపల్లె వద్ద వరిని కోసి నూర్పిడి చేస్తున్న యంత్రం



వరినూర్పిడి చేస్తున్న కూలీలు



కొలమాసనపల్లె వద్ద వరికోతల్లో కూలీలు

- వరికోత, నూర్పిడి యంత్రాలకు డిమాండ్
- తమిళనాడు నుంచి ఇక్కడికి వచ్చిన వాహనాలు

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో గతంలో ఏటా తీరని వర్షాభావ పరిస్థితులే వెంటాడేవి. కానీ నాలుగేళ్లుగా వరుణుడి కరుణతో మంచి వర్షాలు కురుస్తున్నాయి. పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో గత వేసవిలో సాగు చేసిన వరిమడులు ఇప్పుడు కోతలు, నూర్పిడులు సాగుతున్నాయి. రైతులంతా పొలం పనులతో బిజీ బిజీగా ఉన్నారు. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. తమిళనాడు రాష్ట్రం నుంచి ఇక్కడికి చేరుకున్న నూర్పిడి యంత్రాలకు డిమాండ్ వచ్చింది. ఈ పర్యాయం డివిజన్‌లో 900 హెక్టార్లలో వరి సాగైంది.

వ్యవసాయ కూలీలకు చేతినిండా పనులు

ఈ ప్రాంతంలో వరికోతలు మొదలవడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎకరా పొలంలో వరి కోతలకు 30మంది కూలీల అవసరం ఉంది. రోజూ కూలీ ధర సైతం రూ.500కు చేరింది. కూలీలు లభించక రైతులు పొరుగు గ్రామాలకు ఆటోలను పంపి మరీ కూలీలను పనులు రప్పించుకుంటున్నారు. డిమాండ్ మూలాన ముందుగానే అడ్వాన్స్ ఇస్తున్నట్టు కొందరు రైతులు చెప్పారు. రైతులు పంటకోత, నూర్పిడులు చేసేందుకు గుత్తలకు ఒప్పిస్తున్నారు. ఎకరా పొలంలో వరికోతకు గుత్త రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు కుదుర్చుకుంటున్నారు. అయినప్పటికీ కూలీలకు డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు.

వరికోత, నూర్పిడి యంత్రాల జోరు

వరికోతలకు ఇక్కడ నెలకొన్న డిమాండ్‌ను గమనించి తమిళనాడు రాష్ట్రం నుంచి వరికోత, నూర్పిడి యంత్రాలు వందలసంఖ్యలో ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. వరిని కోసి, నూర్పిడి చేసే యంత్రానికి గంటకు 4 వేల రూపాయలు, కేవలం నూర్పిడి చేసే యంత్రానికైతే గంటకు 3 వేల రూపాయల వరకు అద్దె వసూలు చేస్తున్నారు.

వరికోతలకు పెరిగిన కూలీల డిమాండ్



ఈ దఫా వరిపంట దిగుబడులు బాగున్నాయి. కానీ ఇటీవల వర్షాల కారణంగా ఇప్పుడు ఎలాగైనా మడులు కోసి ఒబ్బిడి చేసుకోవాలనుకున్నాం. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇదే సమయంలో తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు స్థానికంగా అందుబాటులోకి రావడంతో వాటికి కూడా ఇప్పుడు డిమాండ్ వచ్చింది. కోతలు త్వరగా పూర్తి చేయడానికి వీటిని వాడుతున్నారు. –విజయ్, మునలిమొడుగు, పలమనేరు మండలం

ఈసారి దిగుబడులు బాగున్నాయ్



ఈ దఫా వేసవిలో నాటిన మడులు ఇప్పుడు కోతలకొచ్చాయి. ఒకేసారి రైతులు వరిపంట నూర్పిడులకు పూనుకోవడంతో అన్నిచోట్లా పనులకు డిమాండ్ కలిగింది. అయితే కూలీలు తగినంతగా లభించకపోవడంతో యంత్రాలను వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు వర్ష సూచనలను గమనించి వరినూర్పిడిలు చేసుకోవాలి. టార్పాలిన్ పట్టలు లాంటివి ఉంచుకుంటే మంచిది. –సంధ్య, వ్యవసాయాధికారిణి, పలమనేరు

ఓటరు ఫారాల నిశిత పరిశీలన



ఓటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఓటరు నమోదు, తొలగింపు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ బీఎల్‌వోలను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న దరఖాస్తు పరిశీలన కార్యక్రమాన్ని ఆదివారం కమిషనర్ అరుణ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎంజీఆర్ వీధి, మిట్టూరు, శాంతినగర్ తదితర ప్రాంతాల పరిధిలో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బీఎల్వోల వద్దనున్న ఫారం 6, 7, 8 దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, ప్రజలతో నేరుగా మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ–2024 కార్యక్రమం డిసెంబర్ 9వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో కొత్తగా ఓటు హక్కు నమోదుతోపాటు, తొలగించడం, మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నట్లు వివరించారు. ఇదే విషయాన్ని బీఎల్వోలు పోలింగ్ కేంద్రం స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తులతోపాటు అందిన ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన ద్వారా తనిఖీ చేయాలన్నారు. అన్ని సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చేనెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమంపై పోలింగ్ కేంద్రాల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.